## క్లుప్తంగా

### లాయర్లకు న్యాయం జరిగేలా చూడాలి



ఎంపీకి వినతి పత్రం సమర్పిస్తున్న న్యాయవాది

**ఖమ్మం లీగల్:** అడ్వకేట్ అమెండ్‌మెంట్ బిల్ 2025లో ఉన్న లోపాలను సవరించి లాయర్లకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని న్యాయవాది తాళ్లూరి దిలీప్ ఆధ్వర్యాన ఆదివారం పార్లమెంట్ సభ్యుడు రఘురాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. న్యాయవాద నోటరీ నోటిఫికేషన్ 2021లో దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూ నిర్వహణలో జాప్యం లేకుండా చూడాలని, బాధితులకి సత్వర న్యాయం జరిగేలా నాన్‌బెయిలబుల్ కేసుల్లో ఏడేళ్ల లోపు శిక్ష పడే జడ్జిమెంట్‌పై చర్చించాలని, క్రిమినల్ మేజర్ యాక్ట్‌లో కొన్ని సవరణలు చేయాలని కోరారు. దీనికి ఎంపీ సానుకూలంగా స్పందించి సమావేశాల్లో చర్చిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పసుపులేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

### వనజీవి రామయ్యకు నివాళి



నివాళులర్పిస్తున్న కొరిపల్లి శ్రీనివాస్

**ఖమ్మం మామిళ్లగూడెం:** పద్మశ్రీ వనజీవి రామయ్య భౌతికకాయానికి ఆదివారం 'దళిత రత్న' అవార్డు గ్రహీత, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వనజీవి రామయ్య ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా మొక్కలు నాటాలని, వృక్ష ప్రేమికులుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పండ్లు, భోజన ప్యాకెట్ల పంపిణీ



పండ్లు, భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

**ఖమ్మం మామిళ్లగూడెం:** భారత రాజ్యాంగ నిర్మాత, సంఘ సంస్కర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి వేడుకల్లో భాగంగా ఆదివారం ముందస్తుగా బాలు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చెరుకుపల్లి బాలు ఆధ్వర్యాన నగరంలోని చర్చి కాంపౌండ్ సీఎస్‌ఐ చర్చి ఎదురుగా భిక్షాటన చేసే వృద్ధులతో పాటు వికలాంగులకు పండ్లు, భోజన ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సీహెచ్.ప్రవళిక, పంది వేణు, కె.సైదులు, సీతారాములు, గట్టికొండ చుక్కయ్య, పడిశాల వీరస్వామి, కె.కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎండలోనే ఉపాధి..

ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యాన ఉపాధి హామీ పథకం పనుల ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. దీంతో కూలీలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు కూడా అందుబాటులో లేవు. నీడ లేక ఎర్రటి ఎండలోనే మగ్గాల్సి వస్తోంది. కూలీలకు సౌకర్యాలు కల్పించడంలో సంబంధిత అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. దీంతో కూలీల సంఖ్య పెరగడం లేదని తెలుస్తోంది.

– నేలకొండపల్లి



మంద్రాజుపల్లి వద్ద పని చేస్తున్న కూలీలు (ఇన్‌సెట్) బైరవునిపల్లి పని ప్రదేశంతో గాయపడిన కూలీ లక్ష్మి(ఫైల్)

**ఉపాధి హామీ.. వసతుల లేమి**

- పని చోట సౌకర్యాలు కరువు
- ప్రథమ చికిత్స కిట్ల జాడేలేదు
- కనీసం తాగునీటి సరఫరా లేని వైనం
- పట్టించుకోని అధికారులు

**అస్తవ్యస్తంగా పనులు..**

పాలేరు నియోజకవర్గంలో ఉపాధి పనుల పట్ల అధికార యంత్రాంగం నిర్లక్ష్యం చూపుతోంది. మొక్కుబడిగా పర్యవేక్షిస్తుండడంతో పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయి. గ్రామాల్లో పని కల్పించి వలసలు నివారించేందుకు ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించి చట్టం చేసింది. కానీ పనులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించడంలేదనే విమర్శలు ఉన్నాయి. పని చేసే చోట కనీస సౌకర్యాల సంగతి దేవుడెరుగా.. నిరంతరం పర్యవేక్షించాల్సిన పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ అధికారులు పర్యవేక్షించడకుండా ఫీల్డ్ అసిస్టెంట్ ఇచ్చిన రిపోర్టును మాత్రమే జిల్లా అధికారులకు పంపించే పనులు చేస్తున్నారు. ఒకరి పేరు బదులు మరొకరు పని చేయడం, రాని వారి పేర్ల మీద మస్టర్లు వేయడం లాంటి అక్రమాలకు పాల్పడుతున్నారు. చాలా చోట్ల ఫీల్డ్ అసిస్టెంట్లు సీనియర్ మేట్ల సెల్‌ఫోన్లలో యాప్‌ను ఎక్కించి తమకు సంబంధం లేదన్నట్లుగా చేతులు దులుపుకుంటున్నారు. దీంతో సినియర్ మేట్లు ఆడిందే ఆట, పాడిందే పాటగా పనులు సాగుతున్నాయి.

**జాడలేని సౌకర్యాలు..**

పని ప్రదేశంలో టెంట్ వేసి నీడ వసతి కల్పించాల్సి ఉండగా...అమలకు నోచుకోవటం లేదు. దీంతో ఎండలోనే కూలీలు పని చేయాల్సి వస్తుంది. ఓఆర్ఎస్ ప్యాకెట్లు సమకూర్చటంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రెండు నెలలు ఎండలు పెరగనుండటంతో నీడ వసతి కల్పించాల్సి ఉంది. మరో వైపు పని ప్రదేశాలలో తరుచూ గాయపడుతూ సొంతంగా చికిత్స చేయించుకుంటున్నారు. కనీసం ప్రథమ చికిత్స కిట్స్ లేకపోవటం చూస్తే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక పని ప్రదేశంలో కూలీలకు నీటి వసతులు జాడలేదు. ఒక్కో కూలీకి రోజు కు రూ. 2 చొప్పున నీటిని తాగు నీటి కోసం పంచాయతీలకు చెల్లిస్తున్నారు. వీటి నిర్వహణ పై నామమాత్రంగా తనిఖీలు చేస్తుండటంతో కూలీలు దాహార్తితో అలమటించాల్సి వస్తోందని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నత్తనడకన 'పొలంబాట'..**

పల్లెల్లో వ్యవసాయ క్షేత్రాల వద్దకు వెళ్లడానికి దారులు సరిగ్గా లేక ఎరువులు, విత్తన బస్తాలు తరలించేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వారి కష్టాలను తీర్చేందుకు పొలం బాట పనులు ఉపాధి హామీ పథకంలో చేర్చారు. యాసంగి పంటలు సాగు పనులు రహదారి నిర్మాణానికి ఆటంకాలు ఎదురవుతున్నాయని అధికారులు సాకులు చెబుతున్నారు. కొన్ని చోట్ల ఆక్రమణకు గురికావడం, హద్దులు చూపకపోవడం, పక్కనున్న రైతులు అభ్యంతరం చెప్పడం తదితర కారణాలతో చాలా చోట్ల పనులు ప్రారంభించలేదు. కొన్నిచోట్ల అసంతృప్తిగా చేపట్టారు. మొత్తం మీద పొలం బాట పనులు ఆశించినస్థాయిలో జరగలేదని తెలుస్తోంది.

**కనీసం నీడ కూడా లేదు..**



పని ప్రదేశంలో కూలీలకు కనీసం నీడ సౌకర్యం లేదు. ఎండతీవ్రత ఎక్కువగా ఉండడంతో వడదెబ్బ తగలకుండా టెంట్లు వేయించాలి. అవసరమైన ప్రథమ చికిత్స కిట్లు, తాగునీటి సౌకర్యాలు అందించేలా చర్యలు తీసుకోవాలి.

– పాల్య శ్రీనివాస్, మంగాపురం, కూలీ

**అధికారులు పట్టించుకోవట్లే..**



ఉపాధి కూలీల పట్ల అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. పెండింగ్ కూలీల వేతనాలు ఇవ్వడం లేదు. పనులు దూరం ఉన్న చోట వాహనాలు ఏర్పాటు చేయడం లేదు. పనులు మొక్కుబడిగా కాకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలి.

– కాశిబోయిన అయోధ్య, వ్య.కా.సం. నాయకుడు

**పనులు పర్యవేక్షిస్తున్నాం..**



కూలీలకు నీడ వసతి, తాగు నీటి సరఫరా పంచాయతీలదే బాధ్యత. ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నాం. నిరంతరం పనులను పర్యవేక్షిస్తున్నాం. ఒకరికి బదులు మరొకరు వస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– ఎం.యర్రయ్య, ఎంపీడీఓ

## ఖమ్మం చేరుకున్న ఉద్యమకారుల చైతన్య యాత్ర



యాత్రకు స్వాగతం పలుకుతున్న మహిళలు

**ఖమ్మం మామిళ్లగూడెం:** ఈనెల 21న సికింద్రాబాద్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ ఆధ్వర్యాన నిర్వహించే ప్లీనరీ సమావేశాన్ని విజయవంతం చేయాలని 'తెలంగాణ ఉద్యమకారుల చైతన్య యాత్ర' ఆదివారం ఖమ్మంకు చేరుకుంది. ఈనేపథ్యాన మహిళ ఉద్యమకారులు పెద్దఎత్తున బతుకమ్మలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఫోరమ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్, రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కే.వీ.కృష్ణారావులతో పాటు ఫోరమ్ ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్యలు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలో భాగంగా 250 గజాల స్థలం, రూ.25వేల పెన్షన్, ఇల్లు నిర్మాణానికి రూ.10 లక్షలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ తెలంగాణ ఉద్యమకారులు నరేందర్, విజయ్‌కుమార్, పద్మాచారి, వెంకటేశ్వరావు, రవిచంద్రచౌహాన్, సతీశ్, రాజేందర్‌నాయక్, వరలక్ష్మి, ఉమాయాదవ్, షేక్ అబ్బాస్, ఎస్‌డీ బురాన్, ఆసిఫ్, భాస్కరరెడ్డి, రాము గౌడ్, యాకుబ్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, ధనలక్ష్మి, మేరీ, విక్టోరియా, అనంతలక్ష్మి, స్వరూప, జయ, పద్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### ఘనంగా మట్టల ఆదివారం



ఈత మట్టలతో వేడుకలో పాల్గొన్న క్రైస్తవులు

**తిరుమలాయపాలెం:** మండలంలోని పిండిప్రోలు గ్రామంలో మట్టల ఆదివారం పండగను సీఎస్ఐ పాస్టర్ వేముల ప్రకాష్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈత మట్టలు చేతబూని క్రైస్తవ పాటలు పాడుతూ వీధుల వెంట సర్వోన్నతుడైన ఏసు క్రీస్తుకు జయము, రానున్న యేసయ్యకు జయము అని నినాదాలు చేస్తూ సువార్తను ప్రకటించారు. తదుపరి దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో లతా, మాణిక్యారావు, పప్పుల దానియల్, గోపోజి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ఎక్కడి చెత్త అక్కడే..



సీసీ రోడ్డుపై వేసిన చెత్త

**నేలకొండపల్లి:** నేలకొండపల్లి మేజర్ పంచాయతీలో చిత్తశుద్ధి కొరవడింది. ఎక్కడ వేసిన చెత్త అక్కడే అన్న చందంగా డ్రెయిన్లు దుర్వాసనతో కంపు కొడుతున్నాయి. ముక్కు మూయకుండా వీధుల వెంట నడవలేనివి దుస్థితి నెలకొంది. కనీసం బ్లీచింగ్ కూడా చల్లే పరిస్థితి కనిపించడం లేదు. అధికార యంత్రాంగం నిర్లక్షమో లేదా నిధులు లేమితోనే గానీ పారిశుద్ధ్యం మాత్రం అటకెక్కిందని పలువురు మండిపడుతున్నారు. సైడ్ డ్రెయిన్లలోని మురుగు నిల్వలతో దోమలు వృద్ధి చెంది స్వైర విహారం చేస్తున్నాయి. పాలకవర్గం లేకపోవడంతో అధికారులు పట్టించుకోవడం కరువైంది. రహదారుల వెంట పారిశుద్ధ్యంపై చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) పి.శ్రీజకు స్థానికులు ఫిర్యాదు కూడా చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



నేలకొండపల్లిలో ఓ వీధిలో చెత్త చెదారం

## అకాల వర్షం ఆగమాగం..



వేడి, ఉక్కపోతలో అతలాకుతలం చేస్తున్న వాతావరణం ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా మారిపోయింది. ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో వడగళ్లతో కూడిన వర్షం కురిసింది. ధాన్యం, మొక్కజొన్నలు తడిసి కొట్టుకుపోయాయి. పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మం అర్బన్: వడగళ్ల వాన



నేలకొండపల్లి: రాజేశ్వరపురంలో మొక్కజొన్నలపై కప్పిన పట్టాలు



కొత్తకొత్తూరు - నాచేపల్లి గ్రామాల మధ్య విరిగిన భారీ వృక్షం



మంగాపురంలో పట్టాలు కప్పుతున్న రైతులు

## ధాన్యం కొనుగోళ్లలో జాప్యం ఉండొద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

**ఖమ్మంరూరల్:** ధాన్యం కొనుగోళ్లలో జాప్యం లేకుండా సమర్థంగా నిర్వహించాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం మండలంలోని వాల్యాతండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దయాకర్‌రెడ్డి, కళ్లెం వెంకటరెడ్డి, మద్ది మల్లారెడ్డి, కొప్పుల చంద్రశేఖర్, పాపానాయక్, జర్పుల లక్ష్మణ్, ధరావత్ బాబు, రూప్‌సింగ్, ఉపేందర్, వెంకన్న, కిషన్ పాల్గొన్నారు.

## నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

**ఖమ్మంమయూరిసెంటర్:** నగరంలోని మున్నేరు వరద నుంచి నగరాన్ని కాపాడేందుకు ప్రభుత్వం చేపట్టిన రిటైనింగ్ వాల్ నిర్వాసితులకు 2013 సంవత్సరం ప్రభుత్వం చేసిన చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ ఖమ్మం త్రీ టౌన్, ఖమ్మం రూరల్ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్వాసితులకు తగిన న్యాయం చేయడంలో అధికారులు ఒక తీరుగా, మంత్రులు మరో తీరుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు నగరంలోనే ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు, తగిన నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తీగల వంతెన కోసం 100 కుటుంబాలు నష్టపోతున్నారని, వారికి కూడా తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే కాలంలో ఈ సమస్యపై దశలవారీగా ఆందోళనలు చేస్తామని అన్నారు. దీనిలో భాగంగా మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, నాయకులు బండి రమేష్, వై.శ్రీనివాసరావు, మాదినేని రమేష్, నండ్ర ప్రసాద్, జబ్బార్, శ్రీనివాసరావు, కార్పొరేటర్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

**నివాళి..**

**తిరుమలాయపాలెం:** మండలంలోని పిండిప్రోలు మాజీ సర్పంచ్, సీపీఎం నాయకుడు అంగడి వీరస్వామి సతీమణి పద్మ (50) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈమేరకు సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, శ్రీను, సుధాకర్‌రావు, న్యాయవాది వెంకటేశ్వర్లు, శరత్‌కుమార్, ఆనందరావు, ఇజ్రాయిల్, లాజరస్, నాగేశ్వరరావు, రవి, తదితరులు పాల్గొన్నారు.

## నిధుల మంజూరుకు సహకరించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు, రైతులు

**కామేపల్లి:** మండలంలోని పింజరమడుగులో 65 ఏళ్ల క్రితం నిర్మించిన లిఫ్ట్ ఇరిగేషన్ శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన ఎత్తిపోతల పథకం నిర్మాణానికి నిధుల మంజూరుకు సహకరించాలని కోరుతూ టీజీఐడీసీ చైర్మన్ విజయబాబుకు కాంగ్రెస్ మండల నాయకులు, ఆయకట్టు రైతులు ఆదివారం వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, సొసైటీ ఉపాధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు, తోటకూరి శివయ్య, నల్లమోతు లక్ష్మయ్య, ఇంజం నాగభూషణం, సత్యనారాయణ, వంకాయలపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

## 15 నుంచి ఏఐకేఎస్ జాతీయ మహాసభలు

**ఖమ్మంమయూరిసెంటర్:** ఈ నెల 15 నుంచి 17 వరకు మూడు రోజులపాటు ఏఐకేఎస్ జాతీయ 30వ మహాసభ తమిళనాడులోని నాగపట్నంలో జరుగనున్నాయని, ఈ మహాసభలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై రైతాంగ పోరాటాలకు రూపకల్పన చేయనునట్లు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అధ్యక్షుడు బాగం హేమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. మోదీ ప్రభుత్వం రోజురోజుకు వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గిస్తూ వ్యవసాయరంగానికి ఇస్తున్న సబ్సిడీలు కూడా కోత పెడుతున్నాడని విమర్శించారు. నూతనంగా జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానం బిల్లును తీసుకొచ్చి దేశంలో మార్కెట్లను ప్రైవేట్, కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన తెలిపారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల వ్యవసాయ రంగం రోజురోజుకు సంక్షోభంలోకి కూరుకుపోతుందని అన్నారు. ఈ మహాసభల్లో వివిధ రాష్ట్రాల నుంచే కాకుండా ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు.

## నేటితో గడువు పూర్తి..



కేఎంసీలో దరఖాస్తులు స్వీకరిస్తున్న దృశ్యం(ఫైల్)

- రాజీవ్ యువ వికాసం పథకానికి నేడే చివరి తేదీ
- సెలవు రోజూ కేఎంసీలో ప్రత్యేక కౌంటర్లు
- నగరంలో ఇప్పటి వరకు 6,166 దరఖాస్తుల స్వీకరణ

**ఖమ్మంమయూరిసెంటర్:** నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల గడువు నేటితో ముగియనుంది. ఈ నెల 14వ తేదీ వరకు ఈ పథకానికి అర్హులైన లబ్ధిదారులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. అయితే దరఖాస్తులు ఆన్‌లైన్ చేసుకునేందుకు రెండు రోజులుగా సర్వర్ రాకపోవడంతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు లేక ఇప్పటి వరకు పథకానికి దరఖాస్తు చేసుకోలేకపోయిన వారు ఆ పత్రాలు రావడంతో దరఖాస్తు చేసుకునేందుకు ఆన్‌లైన్ సెంటర్లకు క్యూ కడుతున్నారు.

**ఆఫ్‌లైన్‌లోనూ అవకాశం..**

రెండు రోజులుగా సర్వర్ మొరాయిస్తుండడంతో అధికారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోలేకపోయిన వారు మండల కేంద్రాల్లో ఎంపీడీఓ, మున్సిపల్ కార్యాలయాల్లో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు ఇవ్వొచ్చని వెల్లడించారు. శని, ఆదివారం, సోమవారం (అంబేడ్కర్ జయంతి) వరుస సెలవులు రావడం, సోమవారం పథకానికి చివరి రోజు కావడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. చివరి రోజు కూడా దరఖాస్తులు స్వీకరిస్తే బాగుంటుందని పేర్కొంటున్నారు.

**కేఎంసీలో దరఖాస్తుల స్వీకరణ..**

రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను స్వీకరించేందుకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు సోమవారం ప్రత్యేక కౌంటర్లు తెరిచేలా ప్రణాళికలు సిద్ధం చేసి కౌంటర్లను తెరిచి ఉంచాలని నిర్ణయించారు. మెప్మా సిబ్బందిని ఈ కౌంటర్ల వద్ద ఉండి దరఖాస్తుదారులకు రశీదులు ఇవ్వనున్నారు. ఈ కౌంటర్ల వద్ద ఆఫ్‌లైన్ దరఖాస్తులను సిబ్బంది తీసుకోనున్నారు.

**6,166 దరఖాస్తులు..**

రాజీవ్ యువ వికాసం పథకానికి కేఎంసీలో పరిధిలో 6,166 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 6,157 దరఖాస్తులు ఆన్‌లైన్, 9 దరఖాస్తులు ఆఫ్‌లైన్‌లో వచ్చాయి. ఇక ఎస్సీలు 1,332, ఎస్టీలు 389, బీసీలు 2,951, మైనారిటీలు 1,173, క్రిస్టియన్లు 7, పీహెచ్‌సీ 44, ఇతరులు 261 మంది దరఖాస్తులు చేసుకున్నారు.

### నగరంలో సినిమాలు

| | |
|---|---|
| తిరుమల | గుడ్ బ్యాడ్ అగ్లీ |
| వినోద | మ్యాడ్ స్క్వేర్ |
| సాయిరాం | జాట్ |
| ఆదిత్య | అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి రాబిన్ హుడ్ |
| శ్రీనివాస | జాక్ |

- ఖమ్మంగాంధీచౌక్

### ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

| కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో) | | ఆకుకూరల కట్టలు (రూ.ల్లో) | |
|---|---|---|---|
| టమాట | 20 | బచ్చలికూర | 4 |
| వంకాయ | 20 | | 20 |
| బెండకాయ | 26 | పాలకూర | 4 |
| పచ్చిమిర్చి | 46 | | 20 |
| కాకర | 46 | చుక్కకూర | 4 |
| బీట్‌రూట్ | 20 | | 20 |
| బీర | 60 | తోటకూర | 4 |
| దొండ | 16 | | 20 |
| పొట్లకాయ | 40 | గోంగూర | 4 |
| చిక్కుడు | 86 | | 20 |
| గోరుచిక్కుడు | 40 | మెంతికూర | 3 |
| క్యాబేజీ | 20 | | 20 |
| క్యాలీఫ్లవర్ | 35 | కొత్తిమీర | 1 |
| ఆలుగడ్డ | 28 | | 30 |
| చామగడ్డ | 44 | పుదీన | 1 |
| క్యారెట్ | 26 | | 20 |
| క్యాప్సికం | 50 | -ఖమ్మం వ్యవసాయం | |